"ఈ బొమ్మలని గీసిన చిత్రకారుడు అతని వీలునామాలో ఏం రాసాడో వినండి. తన కొడుకు గీసిన బొమ్మని మొదటగా అయిదు రూపాయలతో వేలం వేయాలని, దాన్ని ఎవరు కొంటే వారికి తను గీసిన బొమ్మలన్నిటినీ వుచితంగా ఇవ్వాలని రాసాడు. ఎందుకంటే తండ్రిగా తన కొడుకు గీసిన బొమ్మ మీద అతని ప్రేమ అలాంటిది. కాబట్టి మీరు కోరుకున్న చిత్రాలని మీరు ఇతని నించి కొనుగోలు చేయండి."

ఇలాగే దేవుడికి కూడా తనని ప్రేమించే భక్తుడంటే, అతను ఎంత విలువ లేనివాడైనా సరే, ఆ చిత్రకారుడికి బాగా గీయలేకపోయినా తన బిడ్డ మీద వున్నంత ప్రేమ ఉంటుంది. ఆ ప్రేమని పొందగలిగిన వారు ధన్యులు.

## 7. ప్రార్థన ఫలితం

ఒకామె ఓ మహాత్ముడి దగ్గరకి వెళ్ళి అడిగింది.

"నా భర్తకి కేన్సర్. దయచేసి ఆయనకి ఆ రోగం తగ్గేలా ప్రార్థన చేయండి."

ఆ మహాత్ముడు అందుకు ఒప్పుకుని వరసగా నలభై రోజుల పాటు ఆమె భర్త ఆరోగ్యం కుదుట పడాలని తీవ్ర ప్రార్థనని చేసాడు. ఓ రోజు ఆమె వచ్చి చెప్పింది.

"మా వారు మరణించారు."

"అరెరె! నిత్యం ప్రార్థన చేస్తున్నానే?" ఆ మహాత్ముడు బాధగా చెప్పాడు.

"నాకు తెలుసా సంగతి. అందుకే మీకు కృతజ్ఞతలని చెప్పడానికి వచ్చాను. మా వారి వయసు నలభై ఎనిమిది. ఇంత చిన్న వయసులోనే ఇలాంటి ప్రాణాంతక రోగం వచ్చినందుకు ఆయనకి దేవుడి మీద కోపం వచ్చింది. నేను మీ దగ్గరకి రాక మునుపు 'ఎంతో శక్తి వంతుడైన దేవుడు తన ప్రాణాలని కాపాడలేడా' అని ఆలోచించేవారు. ఆయనకి దేవుడి మీద గల కోపాన్ని మా అందరి మీద ప్రదర్శించేవారు. ఆయన సమక్షంలో వుండటం మా అందరికీ దుర్భరంగా వుండేది. ఆయన తిట్టే తిట్లు సంస్కారవంతులు వినదగ్గవి కావు. కాని మీరు

ప్రార్థనని ప్రారంభించాక క్రమేపీ ఆయనలోని ఆ కోపం తగ్గింది. ఆఖరి మూడు రోజులు ఆయన జోక్స్ వేసి మమ్మల్ని నవ్వించారు కూడా. కలిసి గీతా పఠనం చేసాం. మీ ప్రార్థన వూరికే పోలేదు. చక్కటి ఫలితాన్ని ఇచ్చిందని మీకు తెలియచేద్దామని వచ్చాను." చెప్పిందామె.

## 8. గూఢచారి

ఓ మఠంలోని వారంతా ప్రార్థనా మందిరానికి  ఎప్పటిలా ఉదయం అయిదున్నరకల్లా వచ్చేసారు. కొద్ది నిముషాల్లో ఆ మఠాధిపతి అక్కడికి వచ్చాడు. అతని వెంట ఓ కొత్త వ్యక్తి రావడం మఠవాసులంతా గమనించారు. ఉదయపు ప్రార్థన అయాక మఠాధిపతి అందరితో చెప్పాడు.

"మన మఠం పెట్టి ఇవాళ్టికి సరిగ్గా సంవత్సరం పూర్తయింది. నేను ఎప్పటిలా ఈ రోజు ప్రవచనం చెప్పడం లేదు. ఇతనేం చెప్తాడో మనం అందరం విందాం. ఎందుకంటే నేను చెప్పే ప్రవచనం కన్నా ఇతను చెప్పబోయే దాన్నించి మీరంతా నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది."

అంతా ఆ కొత్త వ్యక్తి వంక ఆసక్తిగా చూసారు. తమలా సన్యాసి కాడు. పేంట్, షర్టుల్లో ఉన్న అతను తామంతా నేర్చుకోవాల్సింది ఏం చెప్తాడబ్బా అనుకున్నారు. మఠాధిపతి అతన్ని ప్రారంభించమన్నట్లుగా సైగ చేసి, కార్డ్‌లెస్ మైక్‌ని ఇచ్చాడు. అతను వెంటనే గొంతు సద్దుకుని చెప్పసాగాడు.

" ముందుగా మీ అందరికీ నా నమస్కారాలు. నా పేరు రామాచారి. నేను ఓ గూఢచారిని. మీ మఠం వ్యవహారాలు ఎలా ఉన్నాయో తెలుసుకోమని నన్ను మీ మఠాధిపతి కొద్ది రోజుల క్రితం నియమించారు. నిన్న ఉదయం నించి రాత్రి దాకా నేను మీ మఠంలోనే, మీ మధ్యే గడిపాను. నిన్న ఉదయం భగవద్గీత క్లాసులో, ఉదయపు ప్రార్థనలో, మధ్యాహ్న భోజనం, సాయంత్రం ధ్యానం క్లాసులో, రాత్రి భోజనంలో నేను మీతో పాటు పాల్గొన్నాను."

రామాచారి జేబులోంచి ఓ కాగితాన్ని తీసి దాన్ని చూస్తూ తను చెప్పేది మళ్ళీ కొనసాగించాడు.